జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
మంగళవారం | 11 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 6

# పాలేరు నీటికి కటకట!

- తాగునీటికే ప్రాధాన్యం. సాగుకు నీరివ్వడం కష్టమే
- సాగర్‌లో నీటి కొర తతో ఇన్‌ఫ్లోకు బ్రేక్.. పాలేరు జలాశయాన్ని పరిశీలించిన ఐబీ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు



2 లో...




# భట్టి సార్ ... జరా బోనకల్ ఫ్లై ఓవర్ వైపు చూడరా.?

- ఫ్లై ఓవర్ పై ప్రమాదాలను నివారించాలి
- ఇప్పటికే పలువురి ప్రాణాలు బలి
- విద్యుత్ దీపాలు లేక వాహనదారుల ఇబ్బందులు
- 10 రోజుల వ్యవధిలో మూడు ప్రమాదాలు
- ఫ్లై ఓవర్ పై పరిశుభ్రత లోపాలు కూడా ఎక్కువే.?
- ఫ్లైఓవర్ పై కనిపించని ఆర్ అండ్ బి అధికారులు
- భట్టి సార్ బోనకల్ ఆర్ అండ్ బి అధికారులపై జర దృష్టిపెట్టండి
- ప్రమాదాలు జరగకుండా నివారించండి
- కోరుతున్న స్థానికులు

**బోనకల్, ఆగస్టు 10 (ప్రజా జ్యోతి):** బోనకల్ రైల్వే ఫ్లైఓవర్ పై తరచూగా జరుగుతున్న ప్రమాదాల నివారణకు డిప్యూటీ సీఎం భట్టి సార్ జరా బోనకల్ ఫ్లైఓవర్ వైపు చూడరా అంటూ మండల ప్రజలు కోరుతున్నారు. ఫ్లై ఓవర్ కు ఇరువైపులా రింగు ఏర్పాటు చేయాలని, ఫ్లై ఓవర్ పై ప్రమాదాలు జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఫ్లైఓవర్ పొడవు ఎక్కువగా ఉండటంతో విద్యుత్ దీపాలు లేక వాహనదారులు వేగంగా ప్రయాణిస్తూ ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలకు గురవుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకంగా ఫ్లైఓవర్‌కు ఇరువైపులా ఎక్కే ప్రాంతం, దిగే ప్రాంతాల్లో వాహనాలు అధిక వేగంతో రావడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, దీనితో వాహనదారులు ఈ ఫ్లై ఓవర్ పై ప్రయాణించాలంటే భయాందోళనకు గురవుతున్నారు. ఈ ఫ్లై ఓవర్ పై ప్రమాదాలు జరిగి ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. జరిగిన ప్రమాదంలో మరికొందరు తీవ్రంగా గాయపడి, మరికొందరు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. దీనితో విద్యుత్ దీపాలు

మిగతా 2 లో...

## మోడీ తీరు మారకుంటే
# పతనమే



- కార్పొరేట్, సంపన్నుల సేవలో కేంద్ర సర్కార్
- అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతలు
- ఖమ్మంలో విజయవంతమైన జైల్ భరో
- వందలాది మంది అరెస్టు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** మోడీ తీరు మారకుంటే పతనం తప్పదని అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. కార్మిక హక్కులను హరించి వేస్తూ లేబర్ కోడ్లను అమల్లోకి తీసుకు వచ్చారని వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టి రైతును భూమి నుంచి తరిమేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఇందుకు ప్రతిఫలం అనుభవించక తప్పదని నేతలు –తెలిపారు.సంయుక్త కిసాన్ మోర్చా సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్ పిలుపు మేరకు ఖమ్మంలో సోమవారం

మిగతా 2 లో...

## వాత్సల్య హాస్పిటల్ పై
# దాడి అమానుషం

- బాధ్యులను కఠినంగా శిక్షించాలి – మెడికల్ అసోసియేషన్ డిమాండ్



2 లో...

ప్రభుత్వం గుడుంబాపై నిషేధం విధించి కఠిన చర్యలు తీసుకుంటున్నామని ప్రకటనలు చేస్తున్నా, నేలకొండపల్లి మండలంలో మాత్రం నాటుసారా వ్యాపారం రెచ్చిపోతోంది. ఎక్సైజ్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా గుడుంబా తయారీ, విక్రయాలు మూడుపూలు ఆరుకాయలుగా సాగుతున్నాయి.

**నేలకొండపల్లి, ప్రజాజ్యోతి**



2 లో..

# గుప్పుమంటున్న గుడుంబా

- నేలకొండపల్లి మండలంలో యథేచ్ఛగా నాటుసారా విక్రయాలు
- ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం - ప్రజల ప్రాణాలతో చెలగాటం

## వాత్సల్య హాస్పిటల్ పై దాడి అమానుషం

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం నగరంలోని ప్రముఖ వాత్సల్య హాస్పిటల్‌పై జరిగిన దాడిని మెడికల్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది.అహర్నిశలు శ్రమించి రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులు,ఆస్పత్రి సిబ్బందిపై ఇటువంటి భౌతిక దాడులకు పాల్పడటం అత్యంత అమానుషమని అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన వైద్య సంఘాల నాయకులు, వెంటనే స్పందించి కేసు నమోదు చేసిన ఖమ్మం టూ టౌన్ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.ఆస్పత్రి ఆస్తులను ధ్వంసం చేసి,వైద్య సిబ్బందిని భయాందోళనలకు గురిచేసిన నిందితులపై టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిందని,అయితే కేవలం కేసు నమోదుతో సరిపెట్టకుండా దాడికి పాల్పడిన వ్యక్తులని ని తక్షణమే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వైద్యులు నిరంతరం రోగుల సంక్షేమం కోసమే పనిచేస్తారని, చికిత్స సమయంలో అనుకోని అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు చట్టబద్ధమైన మార్గాల ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అలా కాకుండా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఆస్పత్రులపై దాడులు చేయడం, వైద్యులపై భౌతిక దాడులకు దిగడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే,నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, హాస్పిటల్ రక్షణ చట్టం (మెడికల్ సర్వీసెస్ పర్సన్స్ అండ్ మెడికల్ సర్వీస్ ఇన్స్టిట్యూషన్స్ యాక్ట్) కింద కేసులు నమోదు చేసి తగిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు.వైద్యులకు రక్షణ లేకపోతే అత్యవసర సమయాల్లో వైద్యం అందించడానికి భయపడాల్సి వస్తుందని, ఇది అంతిమంగా సమాజానికే నష్టమని పేర్కొన్నారు.బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని మెడికల్ అసోసియేషన్ హెచ్చరించింది.నగరంలోని వైద్యులందరూ వాత్సల్య హాస్పిటల్ యాజమాన్యానికి, సిబ్బందికి పూర్తి మద్దతుగా నిలుస్తారని ప్రకటిస్తూ,భవిష్యత్తులో ఆస్పత్రులకు సరైన పోలీస్ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా ప్రముఖ వైద్య నిపుణులు ముక్కపాటి కోటేశ్వరరావు ఐఎంఏ సెక్రటరీ,సాయి భార్గవ్ ఐఏపి ఖమ్మం, కూరపాటి ప్రదీప్ కుమార్, కూరపాటి హరిప్రసాద్,విజయ్,సిద్ధిక్,కంభంపాటి నారాయణ తదితరులు పాల్గొన్నారు

## పాలేరు నీటికి కటకట!

**పాలేరు ఆర్.సీ ఆగస్టు 10 ప్రజా జ్యోతి** పాలేరు జలాశయంలో నీటి లభ్యత తగ్గిపోవడంతో తాగునీటి అవసరాలకే ప్రస్తుతం ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాల్సిన పరిస్థితి నెలకొందని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. సాగర్‌లో నీటి లభ్యత లేకపోవడం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగునీటి కోసం పాలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేయడం ప్రస్తుతం కష్టమేనని ఆయన స్పష్టం చేశారు.కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయాన్ని సోమవారం ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు పరిశీలించారు. సాగర్ ఇన్‌ఫ్లో కాలువ, రంగుల బ్రిడ్జి వద్ద ఉన్న గేట్లు, పెద్దకాలువ, పాతకాలువ గేట్లను పరిశీలించి నీటి పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### ♦ సాగర్ నుంచి నీరు వస్తేనే.

ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీటిని తాగునీటి అవసరాల కోసం భద్రపరుస్తామని ఎస్ఈ తెలిపారు. సాగర్ నుంచి నీటి విడుదల లేకపోవడంతో సాగునీటికి నీటిని విడుదల చేయడం సాధ్యం కాదన్నారు. ఒకవేళ సాగర్ నుంచి నీటి విడుదల జరిగితే పాలేరు జలాశయాన్ని సాధ్యమైనంత మేర పూర్తిస్థాయిలో నింపి, ప్రభుత్వం ఆదేశాల మేరకు సాగునీటిని విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

### ♦ నీటిని కాపాడేందుకు చర్యలు

ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీటిని భద్రపరిచేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఈ వెల్లడించారు. జలాశయంలో నీటి నిల్వలు, గేట్ల పరిస్థితి, కాలువల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఆయన వెంట ఈఈ, జేఈలు, ఇరిగేషన్ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మండలంలో పలు కుటుంబాలను పరామర్శించిన జిల్లా బిజెపి నాయకులు



**చింతకాని ఆగస్టు 10 ప్రజాజ్యోతి** :మండలం కోమట్ల గూడెం గ్రామానికి చెందిన ఆవులూరి ప్రతాపరెడ్డి మరియు పొద్దుటూరు గ్రామానికి చెందిన డాక్టర్ కట్ట వెంకటేశ్వర్లు గారు ఇటీవల కాలంలో అనారోగ్యం చేత మరణించడం జరిగింది. ఈరోజు వారి కుటుంబాలని పరామర్శించి వారి చిత్రపటాలకి పూల దండేసి సంఘీభావం తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బిజెపి అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు,మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు,జిల్లా నాయకులు మరియు చింతకాని బీజేపీ మండల అధ్యక్షులు కొండా గోపి, కోరిపల్లి శ్రీను, చెన్నూరి నాగచారి,కొండా వెంకన్న, వేముల ఎల్లయ్య,ఉమ్మినేని లక్ష్మణరావు,రాయల వెంకటేశ్వర్లు,పెద్దిరాజు, కోయిన్ని నరసింహారావు తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# గుప్పుమంటున్న గుడుంబా

**ప్రభుత్వం గుడుంబాపై నిషేధం విధించి కఠిన చర్యలు తీసుకుంటున్నా, మని ప్రకటనలు చేస్తున్నా, నేలకొండపల్లి మండలంలో మాత్రం నాటుసారా వ్యాపారం రెచ్చిపోతోంది. ఎక్సైజ్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా గుడుంబా తయారీ, విక్రయాలు మూడుపూలు ఆరుకాయలుగా సాగుతున్నాయి.**

● నేలకొండపల్లి, ప్రజాజ్యోతి

- నేలకొండపల్లి మండలంలో యథేచ్ఛగా నాటుసారా విక్రయాలు
- ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం - ప్రజల ప్రాణాలతో చెలగాటం

**ఇంటింటికి సరఫరా**

శంకర్ గిరి తండా నుండి, రాజేశ్వరపురం, చెన్నారం తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో గుడుంబా వ్యాపారం విస్తరించింది. టూ-వీలర్లపై సీసాలతో నింపి ఇంటింటికి సరఫరా చేస్తున్నారు. కస్టమర్ ఫోన్ చేస్తే 10 నిమిషాల్లో ఇంటి దగ్గరికి డెలివరీ ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాత్రి వేళల్లో ఈ వ్యాపారం మరింత జోరుగా సాగుతోంది.

**ప్రాణాంతక కెమికల్స్ – కుటుంబాలు రోడ్డున**

పక్కా పద్ధతులు లేకుండా వివిధ రకాల కెమికల్స్, మందులు కలిపి నాటుసారా★ను తయారు చేస్తున్నారు. చౌకగా దొరుకుతుందనే కారణంతో కూలీలు, రోజువారీ కార్మికులు దీనికి బానిసలవుతున్నారు. నాటుసారా తాగి ఇప్పటికే అనేక మంది తీవ్ర అనారోగ్యాలకు గురై ఆస్పత్రుల పాలయ్యారు.

కొన్ని కుటుంబాల్లో భర్తలు తాగి కొట్టడం, డబ్బులు దుర్వినియోగం చేయడంతో ఇళ్లు లూటీ అయిన ఘటనలు కూడా ఉన్నాయి. గ్రామాల్లో కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోతున్నాయి.

**ఎక్సైజ్ శాఖ నిద్ర**

ప్రభుత్వం ఒకపక్క గుడుంబాపై ఉక్కుపాదం మోపుతామని చెబుతుండగా, మరోపక్క ఎక్సైజ్ డిపార్ట్మెంట్ మాత్రం నిద్రపోతున్నట్లు కనిపిస్తోంది. ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడు లేడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు, సిబ్బందికి ముడుపులు అందుతున్నాయనే ప్రచారం కూడా జరుగుతోంది.

**ప్రజల డిమాండ్**

ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. గుడుంబా తయారు చేసేవారిపై, సరఫరా చేసేవారిపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి చర్యలు తీసుకుంటారా? లేక ఇలాగే గుడుంబా మాఫియా రెచ్చిపోనిస్తారా అనేది చూడాలి.

## మోడీ తీరు మారకుంటే పతనమే

(మొదటి పేజీ తరువాయి...)

జైల్భరో కార్యక్రమాన్ని –నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు.వందలాది –మంది రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. పోలీసులు అఖిలపక్ష నేతలను –అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వందల సంఖ్యలో ఆందోళనకారులు తమను కూడా అరెస్టు చేయాలంటూ పోలీస్ స్టేషన్లో చొచ్చుకుని వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ ఆందోళనకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్య,బానోత్ చంద్రావతి, సివై పుల్లయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు కొండపర్తి గోవిందరావు, దొండపాటి రమేష్, మాదినేని రమేష్, బొంతు రాంబాబు,వి.కోటేశ్వరరావు, –వై. ప్రకాష్,బిఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, కార్మిక సంఘాల నాయకులు శింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, తాటి వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, జి.రామయ్య,యర్రా శ్రీనివాస్,మెరుగు –సత్యనారాయణ, అశోక్, నరాల నరేష్ నాయుడు, ఎండివై పాషా తదితరులు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు మాట్లాడుతూ మోడీ సర్కార్ సంపన్నుల సేవలోనే ఉందని రైతులు,కార్మికుల పట్ల కక్షపూరిత వైఖరిని అవలంభిస్తుందన్నారు. దేశ సంపదను అంబానీ, –అదానీలతో పాటు కార్పొరేట్లకు కట్టబెడుతూ వ్యవసాయ రంగాన్ని కూడా వారి పరం చేసేందుకే నూతన సాగు చట్టాలను తీసుకు –వచ్చిందని ఆయన తెలిపారు. చారిత్రిక పోరాట నేపథ్యంలో సాగు చట్టాలను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన దొడ్డి దారిని వాటిని అమలు చేస్తుందని ఆయన ఆరోపించారు. పంటకు మద్దతు ధరను ప్రకటించడంతో పాటు వాటి అమలుకు మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకు రావాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకు వచ్చేంత –వరకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనను నిర్వహించి ఈ ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామన్నారు. వ్యవసాయాన్ని –లాభసాటిగా చేయడమంటే కార్పొరేట్లకు కట్టబెట్టడమేనా అని ఆయన ప్రశ్నించారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఈ ప్రభుత్వం రద్దు చేసిందని ఇందుకు ప్రతిఫలం అనుభవించక తప్పదన్నారు. యాజమాన్యాల చేతుల్లో కార్మికులను బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తున్నారని దీనిని యావత్ కార్మిక లోకం నిరసిస్తుందన్నారు.12 ఏళ్ల కాలంలో మోడీ ఏ ప్రజా అనుకూల నిర్ణయాన్ని చేయలేదని ప్రజలను వంచించే ప్రయత్నంలోనే దశాబ్ద కాలం గడిపారని హేమంతరావు తెలిపారు. ధరల పెరుగుదలను నియంత్రించడంలో సర్కార్ ఘోరంగా విఫలమైందని ఆయన తెలిపారు. సంఘటిత పోరాటాలే మోడీ ప్రభుత్వాన్ని నిలువరిస్తాయన్నారు. రాముడి పేరుతో ఎంతో కాలం ప్రజలను వంచించలేరని హేమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిడికంటి వెంకటరెడ్డి,శంకరయ్య,సాంబశివరెడ్డి,వరదా నర్సింహారావు, బండి పద్మ, వై. విక్రం, నవీన్రెడ్డి, శోభ, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

## భట్టి సార్ జరా బోనకల్ ఫ్లై ఓవర్ వైపు చూడరా.?

(మొదటి పేజీ తరువాయి...)

లేని ఈ ఫ్లై ఓవర్ ప్రమాదాలకు నిలయంగా మారిందని మండల ప్రజలు మండల ప్రజలు అంటున్నారు. అంతే కాక పరిశుభ్రత కూడా లోపించి, గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్న సరే ఆర్ అండ్ బి అధికారులు కనీసం ఈ ఫ్లై ఓవర్ పై కన్నెత్తి చూడని పరిస్థితి కనిపిస్తుంది. ఈ 10 రోజుల వ్యవధిలోనే ఈ ఫ్లై ఓవర్ పై మూడు ప్రమాదాలు జరిగి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మరి కొంతమందికి కాళ్లు విరిగి తీవ్ర గాయాలైన సంఘటన కూడా జరిగింది. ఆదివారం రాత్రి కూడా శుభాబులు వేసుకొని వెళుతున్న ట్రాక్టర్ ను కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఒకరికి కాలు విరగగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఫ్లైఓవర్‌పై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఇరువైపులా రింగ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. వేగ నియంత్రణకు అనువైన రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, తగిన లైటింగ్ వంటి చర్యలు కూడా చేపడితే ప్రమాదాలను మరింత తగ్గించవచ్చని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు. గత పాలకులు ఈ ఫ్లై ఓవర్ ను అభివృద్ధి చేయలేదు. ప్రస్తుత పాలకులు అభివృద్ధి చేస్తారని ఆశ పడుతున్నారు. కాబట్టి ప్రజల ప్రాణాలకు సంబంధించిన ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి ఫ్లైఓవర్‌ను పరిశీలించి, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి శాశ్వత భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని ప్రజలు అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఫ్లైఓవర్ ఇరువైపులా అవసరమైన చోట రింగ్ ఏర్పాటు చేసి, దానికి తోడు ప్రమాదాలు జరగకుండా డివైడర్లు కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, వేగ నియంత్రణ ఏర్పాట్లు చేసి అమాయకుల ప్రాణాలను కాపాడాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసన,నాయకులు అరెస్టు పోలీస్ స్టేషన్ కు తరలింపు






**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సంఘటిత పోరాటాలకు కార్మికులు కర్షకులు కూలీలు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జైల్ భరో కార్యక్రమానికి తరలివచ్చారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం రింగ్ సెంటర్ నందు గ్రామపంచాయతీ, అంగన్వాడి, మధ్యాహ్న భోజన కార్మికులు,ఆశ కార్యకర్తలు ఉపాధి హామీ కూలీలు, రైతులు సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివచ్చి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.పోలీసులు జైల్ భరో కార్యక్రమాన్ని అడ్డుకొని అరెస్టు చేసి నాయకులను పోలీస్ స్టేషన్ కు తరలించారు. నాయకులను అరెస్టు చేసిన సందర్భంగా అన్ని సంఘాల కార్మికులు రింగ్ సెంటర్ వద్ద నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించారు.ఈ కార్యక్రమం సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ రావులు మాట్లాడుతూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద యువత చేసిన ఉద్యమానికి,గతంలో నిర్వహించిన రైతాంగ పోరాటానికి మోడీ ప్రభుత్వం దిగివచ్చిందని దేశవ్యాప్తంగా జరుగుతున్న జైల్ భరో కార్యక్రమం ద్వారా మోడీ చేస్తున్న అరాచక పరిపాలన అంతం కావాలని అన్నారు. శ్రామిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్ లు మాకొద్దంటూ కార్మికులు, ఆర్థిక భరోసాని కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి పొట్ట కొట్ట వద్దని వ్యవసాయ కూలీలు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నదాతలు ఇతర రంగాల కార్మికులు మరో పోరాటాన్ని నిర్వహించారు. ఇది ఈ ఒక్క రోజుతో ఆగిపోయే పోరాటం కాదని ఇది నాంది మాత్రమేనని హెచ్చరించారు. గ్రామపంచాయతీ అంగన్వాడి మధ్యాహ్నం భోజనం కార్మికులు ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కో కన్వీనర్ దూదిగం బసవయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు కన్నేబోయిన శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు గామాస్ జోగయ్య, నాగులవంచ వెంకట రామయ్య, గ్రామ పంచాయతీ కార్మికుల మండల అధ్యక్ష కార్యదర్శులు గంతాల నాగేశ్వరావు నరేంద్ర,అంగన్వాడీ మండల అధ్యక్ష కార్యదర్శులు కోమ్మినేని మాధవి, కృష్ణకుమారి,నాయకులు ఆశాల మండల అధ్యక్ష కార్యదర్శులు నంద్రు సుధారాణి, ఏసు మణి,షేక్ లాల,ఆంగోతు వెంకటేశ్వర్లు కూడల్లి నాగేశ్వరావు, చిత్తరు కిషోర్, బేతు శ్రీను, శీలం వెంకటేశ్వర రావు, దివ్వెల వీరాంజనేయులు పొట్టేటి వెంకటనారాయణ రెడ్డి, నక్క పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు

# మండలంలో అన్ని కాంగ్రెస్ కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యాదవ్



**చింతకాని ఆగస్టు 10ప్రజాజ్యోతి :** చింతకాని మండలంలోని అన్ని కాంగ్రెస్ పార్టీ కమిటీలను రద్దు చేస్తున్నట్లుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యాదవ్ ప్రకటించారు ఈ రోజు జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్య అతిథులుగా మత్కేపల్లి మార్కెట్ కమిటీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు మండల ఇంచార్జ్ షేక్ మస్తాన్ పాల్గొన్న కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ,జిల్లా కాంగ్రెస్ పార్టీ సూచనలతో మండలంలోని చాలాకాలంగా పనిచేస్తున్న మండల కాంగ్రెస్ పార్టీ మరియు అనుబంధ సంఘాల కమిటీలను అన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీలను రద్దు చేస్తున్నట్లుగా ప్రకటించారు.ఈనెల 15వ తారీఖు నాటికి కొత్తగా మండల కమిటీ ,మండల అనుబంధ సంఘాలు, గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీలు లను నూతనం గా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సూచనలతో ఏర్పాటు చేస్తామని ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొప్పుల గోవిందరావు నాయకులు కొరపాటి కిషోర్, బందెల నాగార్జున,ఇనుకుల్ల సూరారెడ్డి ,ఆలస్యం బసవయ్య , ఎస్కే కాసిం,లింగం రాంబాబు, ఆనం ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం పిపిల్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా

- ఆదూరు ప్రసాద్ ఏకగ్రీవ ఎన్నిక



**కామేపల్లి ప్రజా జ్యోతి ఆగస్టు 10** ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం పిపిల్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన ఆదూరి ప్రసాదము నియమించినట్లు పి పి ఎల్ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ఖమ్మం జోన్ ఇంచార్జ్ ఐ నాలా పరుశురాములు తెలిపారు . ఆదివారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ పకృతి ఆరోగ్య కేంద్రం ఆవరణలో జరిగిన ఖమ్మం జోన్ స్థాయి మహబూబాబాద్ ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నిర్మాణ సన్నాహక సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆధూరి ప్రసాద్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నన్ను పి పి ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవ ఎన్నికకు సహాయ సహకారాలు అందించిన రాష్ట్ర ఫౌండర్ చైర్మన్ మచ్చ నరసయ్య గారికి రాష్ట్ర అధ్యక్షులు ఈదుల రామాంజనేయులు గారికి రాష్ట్ర రిసోర్స్ పర్సన్ డాక్టర్ బీసీ వీరస్వామి గారికి ఖమ్మం ఇంచార్జ్ పరశురాములు గారికి ఖమ్మం జిల్లా నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు జిల్లాలో సంఘం నిర్మాణానికి విద్యార్థిని విద్యార్థుల సమస్యల విద్యార్థుల అభివృద్ధికి ఎదుగుదలకి అందరికీ అందుబాటులో ఉంటూ అందరినీ కలుపుకొని శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా ప్రసాదు తెలిపారు.

# జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా గోరింటాకు వేడుకలు

- మహిళా కాంగ్రెస్ కమిటీఅధ్యక్షురాలు దొబ్బల సౌజన్య
- ముఖ్య అతిథులుగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆధ్వర్యంలో ఆషాఢమాసమును పురస్కరించుకొని గోరింటాకు పండుగ వేడుకలు నిర్వహించనైనది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ లు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఆచారాలలో భాగంగా ఆషాఢమాసమును పురస్కరించుకొని గోరింటాకు పండుగ నిర్వహించిన మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ను కొనియాడారు అదే విధంగా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న ప్రతి మహిళ కాంగ్రెస్ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.అనంతరం జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ తెలుగు సంస్కృతిలో గోరింటాకు పండుగ ప్రత్యేకమైన మరియు అందమైన ఆచారం అని,ముఖ్యంగా ఆషాఢమాసంలో మహిళలు చేతులకు,కాళ్ళకు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని, ఇది కేవలం అలంకారమే కాకుండా ఆరోగ్యం మరియు సాంప్రదాయానికి ప్రతీక అని,గోరింటాకు పండుగ మన బాంధవ్యాలను కలుపుతుందని,ఈ పండుగ మన పూర్వీకులు అందించిన అందమైన,ఆనందకరమైన సాంస్కృతిక సంపద అని అన్నారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు వైరా నియోజకవర్గ శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ సతీమణి లలిత, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ సతీమణి ఇందుమతి, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల, పాకాలపాటి విజయ,కన్నం వైష్ణవి,రుద్రగాని శ్రీదేవి,కరుణ, గజ్జల లక్ష్మీ,దామా స్వరూప ,మందపల్లి నాగమణి,ఊరుకొండ చంద్రిక,కొత్తపల్లి పుష్ప,బలుసు లక్ష్మీ, రేఖా భార్గవి,మంగ,సుగుణ,సుగుణతదితర నాయకులు పాల్గొన్నారు.

# కమలాపురం గ్రామంలో 100% సర్ కార్యక్రమం



**ముదిగొండ ఆగస్టు 10 (ప్రజా జ్యోతి )** కమలాపురం గ్రామంలో బూత్ నెంబర్ 37,38,39 లలో ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆన్లైన్ ప్రక్రియను ముదిగొండ ఈఆర్ ఓ / భూక్యా ధర్మ నాయక్ పరిశీలన చేసి, కమలాపురం గ్రామంలో మూడు బూత్ నెంబర్ లలో నూటికి నూరు శాతం 100% పూర్తి చేసినారు, ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆన్లైన్ 100% ఆన్లైన్ నమోదు చేయడానికి వెనలేని కృషి చేసిన గ్రామ పంచాయతీ సర్పంచ్ పందిరి అంజయ్య కి మరియు గ్రామ కార్యదర్శి, బి ఎల్ ఏ @బి ఎల్ ఓ లకు, ప్రత్యేక ధన్యవాదాలు,గ్రామ పంచాయతీ కార్యాలయం లో,బూత్ లెవెల్ ప్రకారం బి ఎల్ ఓ & బి .ఎల్ .ఏ లకు, ప్రత్యేక టేబుల్స్ ఏర్పాటుచేసి ప్రతిరోజు ఒక పండగ వాతావరణం తలపించేలా ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ చేసినారు, కావున తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపొడి బుచ్చి రామయ్య గారి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పందిరి అంజయ్య ,వాక వెంకటేష్ రెడ్డి,లంకెల తిరుపతి రెడ్డి ,నూక బసవయ్య, అవసానీ వెంకన్న ,బి ఎల్ ఓ లు తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే రాగమయికి జన్మదిన శుభాకాంక్షలు



**సత్తుపల్లి ఆగస్టు10(ప్రజా జ్యోతి)** సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కి మంగళవారం ఆమె పుట్టినరోజు కావడంతో పలువురు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ రెహనా కమల్, వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, కొత్తూరు సర్పంచ్ అయినంపూడి శ్రీనివాసరావు, గంగారం అభివృద్ధి ప్రదాత, గ్రామ విధేయుడు దాసరి మధుమోహన్ రెడ్డి (మధుబాబు),కొత్తూరు ఉపసర్పంచ్ గొర్లమారి రామ్మోహన్ రెడ్డి, సింగరేణి ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు లు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ అనుభవం లేకుండానే,ఎంతో మెజారిటీతో ప్రజల హృదయాలను గెలిచి,తొలి మహిళగా,ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇప్పటికే నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, ముందు ముందు కూడా ఇంకా మంచిగా అభివృద్ధి చేసి, ఇంకా ఎన్నో పదవులు అధిరోహించాలని, ఆమెకు ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు అందించి, ప్రజలకు మరింత సేవ చేయాలని వారు కోరి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినారు.

## 12వ వేజ్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి

- జేఏసీ ఆధ్వర్యంలో ఏరియా జీఎం కార్యాలయం ముందు ధర్నా



**సత్తుపల్లి ఆగస్టు10(ప్రజా జ్యోతి)** 12వ వేజ్ బోర్డు వేతన కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ,11వ వేజ్ బోర్డు పదవీకాలం ఈ ఏడాది జూన్ నెలతో ముగిసినప్పటికీ ఇప్పటివరకు 12వ వేజ్ బోర్డు కమిటీని ఏర్పాటు చేయకపోవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా కోల్ ఇండియా సంస్థల పరిధిలో చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగానే సత్తుపల్లి ఏరియాలో ఈ ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని పరిరక్షించే విధంగా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.అనంతరం 12వ వేజ్ బోర్డు వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ వెంకటాచారికి జేఏసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సముద్రాల సుధాకర్, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి. కోటేశ్వరరావు, హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, సీఐటీయూ నాయకులు గిద్దయ్యతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, డీఎల్ఆర్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో "జైల్ భరో" నిరసన విజయవంతం.

- రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నశించాలి.




**కారేపల్లి, ఆగస్టు 09, ప్రజా జ్యోతి:** సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా, సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ అనుబంధ అఖిల భారత ఐక్య రైతు సంఘం, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా , అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘంల ఆధ్వర్యంలో సింగరేణి మండల కేంద్రంలోని సినిమా సెంటర్‌లో "జైల్ భరో" నిరసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ ఆందోళన కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం డివిజన్ కార్యదర్శి గుగులోత్ తేజ నాయక్, సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ టేకులగూడెం సర్పంచ్ & మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, టి యు సి ఐ సంయుక్త మండల ప్రధాన కార్యదర్శి ధరావత్ సక్రు అధ్యక్షుడు నాగేశ్వర రావు, ధరావత్ సక్రు, పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వి రాకేష్, ఏఐపీకేఎస్ డివిజన్ నాయకులు రావుల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. కనీస మద్దతు ధరల గ్యారంటీ చట్టం, సమగ్ర రుణ విమోచన చట్టాలను తక్షణమే తీసుకరావాలి అమెరికా, బ్రిటన్, న్యూజిలాండ్ దేశాలతో చేసుకున్న రైతు వ్యతిరేక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలి. విద్యుత్ సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలి. కార్మికుల హక్కులను కాలరాసే నాల్గు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, రైతులకు ఉపయోగపడేలా పంటల బీమా పథకాన్ని పునర్నిర్మించాలి. 2013 భూ సేకరణ చట్టం, 2006 అటవీ హక్కుల (పోడు భూముల) చట్టం, మరియు 2011 కౌలుదారుల చట్టాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేసి రైతులకు, ఆదివాసీలకు న్యాయం చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ సామాన్య ప్రజలు, రైతులు, కార్మికుల పొట్ట కొడుతున్నాయని, ఈ రైతు–కార్మిక పోరాటాన్ని ఇలాగే కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు గుగ్గిల రాము, గుమ్మడి ఎర్రయ్య, గుమ్మడి కిరణ్, గుమ్మడి కళ్యాణ్, ఇతర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మామిళ్లగూడెం నుంచి ఐసీఐసీఐ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్‌గా అర్వపల్లి అఖిల నాగ రమ్య

- చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థాయికి ఎదిగిన యువతి
- పిల్లలు పుట్టినప్పుడు కాదు వారు భవిష్యత్తులో అభివృద్ధిలోకి వచ్చినప్పుడే నిజమైన ఆనందం అని నిరూపించిన అర్వపల్లి నగేష్-శ్రీలక్ష్మి




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** మామిళ్లగూడెం లో నివాసం ఉండే మధ్యతరగతి కుటుంబానికి చెందిన అర్వపల్లి నగేష్– ల కుమార్తె అఖిల నాగరమ్య, చిన్ననాటి నుండే చదువులో ముందుండి,ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పట్టుదలతో, ఉన్నత చదువులు చదివి నేడు దేశంలోనే ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించే స్థాయికి ఎదిగారు. కష్టపడి చదివి, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆమె విద్యా ప్రస్థానం నిరూపిస్తోంది.ఎన్ని కష్టాలు ఎదురైనా తన కుమార్తె భవిష్యత్తు బాగుండాలని, ఆర్థికంగా ఎన్నో సమస్యలు తలెత్తిన, కుమార్తెను వెన్ను తట్టి ప్రోత్సహించడంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించారు తద్వారా అఖిల నాగ రమ్య 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మామిళ్లగూడెంలోని మాంటిస్సోరి ప్రైవేట్ స్కూల్‌లో విద్యనభ్యసించారు. అనంతరం ఇంటర్ విద్యను సాహితి జూనియర్ కాలేజీలో పూర్తిచేశారు. ఉన్నత విద్యలో భాగంగా గుంటూరులోని మాస్టర్ మైండ్స్ కాలేజీలో తన చదువును కొనసాగించారు.విద్యార్థి దశ నుంచే పట్టుదల,క్రమశిక్షణతో చదువుతూ తన లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేసిన అఖిల నాగ రమ్య,తాజాగా ఐసీఐసీఐ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించటం, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, ఆమెను చదివించిన ఉపాధ్యాయుల్లో ఆనందాన్ని నింపింది.విద్యకు కృషి తోడైతే విజయానికి హద్దులు ఉండవు" అన్నట్లుగా అఖిల నాగ రమ్య సాధించిన ఈ విజయాన్ని పలువురు అభినందిస్తున్నారు. ఆమె మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, తల్లిదండ్రులకు, చదివిన పాఠశాల–కళాశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు.

### ♦ తల్లిదండ్రుల ఆనందం

కూతురు చిన్ననాటి నుంచి కష్టపడి చదువుకుని ఉన్నత ఉద్యోగాన్ని సాధించడం పట్ల తల్లిదండ్రులు నగేష్, శ్రీలక్ష్మి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.అఖిల నాగ రమ్య భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.మామిళ్లగూడెం నుంచి ప్రారంభమైన అఖిల నాగ రమ్య విద్యా ప్రయాణం.. ఐసీఐసీఐ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ స్థాయికి చేరుకోవడం నేటి యువతకు స్ఫూర్తిదాయకం.

## మండల, పట్టణ అధ్యక్షులకు, బూత్ లెవెల్ సూపర్ వైజర్ లకు బూత్ లెవెల్ ఏజెంట్లకు, ముఖ్య నాయకులకు అభినందనలు

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఏ ఐ సి సి ఆదేశానుసారం టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచనల మేరకు సంబంధిత శాసనసభ సభ్యుల ఆమోదంతో నియమించబడిన బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ 24-06-2026 మొదలైన నాటి నుండి సంబంధిత అధికారుల సమన్వయంతో పనిచేశారని జిల్లాలో మొత్తం1460 బూత్ లకు ఈనాటికి 1276 బూత్ లలో 95 to 100 శాతం,172 బూత్ లలో 90 to 95 శాతం,12 బూత్ లలో 80 to 90 శాతం నమోదు పూర్తి అయిందని క్షేత్ర స్థాయిలో పనిచేసిన మండల,పట్టణ అధ్యక్షులకు, బూత్ లెవెల్ ఏజెంట్లకు, బూత్ లెవెల్ సూపర్ వైజర్ లకు,ముఖ్య నాయకులకు అధికారులతో సమన్వయంతో పనిచేసిన శ్రేణులు అందరికి కృతజ్ఞతలు,అభినందనలు తెలిపారు.అదే విధంగా జిల్లా కాంగ్రెస్ పార్టీకి నిరంతర సహాయసహకారాలు అందించారని,రాబోవు రోజులలో వారి సహాయసహకారాలు అందించాలని కోరుతూ మధిర నియోజకవర్గ శాసనసభ సభ్యులు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు,పాలేరు నియోజకవర్గ శాసనసభ సభ్యులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,ఖమ్మం నియోజకవర్గ శాసనసభ సభ్యులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా నియోజకవర్గ శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్,సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ సభ్యులు మట్టా రాగమయిదయానంద్ లకు ప్రత్యేకంగా కృతజ్ఞతాభినందనలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.

## ప్రజాస్వామ్యం పరిరక్షణకు మార్పు అవసరం

- సిపిఐ జన చైతన్య యాత్రలో దండి సురేష్



**కారేపల్లి, ఆగస్టు 09, ప్రజా జ్యోతి :** దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాద అంచున ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణకు మార్పు అత్యవసరమని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు .ప్రజలను చైతన్యవంతం చేసేందుకే మార్పు కోరుతూ గ్రామ గ్రామాన సిపిఐ జన చైతన్యా యాత్ర చేపట్టిందని ఆయన తెలిపారు. సోమవారం సిపిఐ జన చైతన్య యాత్ర సింగరేణి మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహించారు .ఈ సందర్భంగా మాదారం, కారేపల్లి, కారేపల్లి క్రాస్ రోడ్ లో జరిగిన సభలో సురేష్ మాట్లాడుతూ ఏ హామీలు ఇచ్చి మోడీ 12 సంవత్సరాల క్రితం అధికారంలోకి వచ్చారో కేంద్ర ప్రభుత్వం ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు హామీలు అమలు చేయకపోగా ప్రజలను ఇబ్బంది పెడుతూ బతకలేని స్థితికి నెట్టి వేశారని సురేష్ తెలిపారు. రైతాంగం ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచక పోగా వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టివేశారని, రసానిక ఎరువులు, పురుగు మందుల ధరలను ఐదు సంవత్సరాల్లోనే రెట్టింపు చేశారన్నారు. లక్షల కోట్లు కార్పొరేట్ అధిపతులకు అప్పులను రద్దు చేసిన మోడీ సర్కార్ రైతంగానికి చెందిన నయా పైసా అప్పులను కూడా రద్దు చేయలేదని ఇది మోడీ కార్పొరేట్ ప్రేమకు రైతుల పట్ల వివక్షతకు నిదర్శనమని అన్నారు. జయరామంటూ రామనామాన్ని జపిస్తూ రాముడి నిధులకే టోపీ పెట్టారని అయోధ్య రామాలయంలో నిధులను కాజేసిన వ్యక్తులపై చర్యలకు సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. మోడీ విధానాలు సంపూర్ణల వర్గాలకు వరంగా మారుతున్నాయని అందుకే కార్పొరేట్లను మోడీ పాలనను కోరుకుంటున్నారని సురేష్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వందలాది హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఉచిత బస్సు సన్నబియ్యం తప్ప ఏ హామీలను నెరవేర్చలేదని మిగిలిన హామీలు అమ్ములు గురించి కనీసం పట్టించుకోవడంలేదని సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. నిరక్షరాస్యులు అయిన రైతల పట్ల యూరియా యాప్ శాపంగా మారిందని బహిరంగంగా మార్కెట్లో ఎరువులు అందుబాటులో ఉంచాలని సిపిఐ డిమాండ్ చేస్తుంది అన్నారు. ప్రభుత్వ శాఖలలో లోపించిన జవాబిదరితనం పైన మంత్రుల స్పందించాలని ప్రభుత్వ కార్యాలయాలకు సామాన్యుడు వెళ్లే పరిస్థితి లేదన్నారు. అనేక చారిత్రిక పోరాటాలతో హక్కులను పథకాలను సక్రమంగా సాధించిందని సిపిఐ ఎప్పుడు ఎన్నికల సందర్భంగా మోడీ రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తుందని తగు రీతులో స్పందించకపోతే పోరాటాలు ప్రజా అగ్రహాన్ని ఎదురుకొక తప్పదని సురేష్ వివరించారు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి రాష్ట్ర సమితి సభ్యులు యార్రబాబు ఏపూరి లతా తదితరులు ప్రసంగించగా జిల్లా కార్యవర్గ సభ్యులు అజ్మీర్ రామ్మూర్తి రావి శివరామకృష్ణ పోటు కళావతి సిహెచ్ సీతామహాలక్ష్మి యంగళ అనందరావు జిల్లా నాయకులు శ్రావణ్ తాటి నిర్మల పుచ్చకాయల వెంకటేశ్వర్లు తాతా వెంకటేశ్వర్లు వీరు నాయక్ ఉంగరాల సుధాకర్ రావు చెన్నం శెట్టి భూసయ్య దల్ సింగ్ పుచ్చకాయల శ్రీను బట్టు సంగయ్య బొమ్మల కృష్ణరాయల రామారావు అమ్మర్ జానీ తదితరులు పాల్గొనగా మాదారం మాజీ సర్పంచ్ అజ్మీర నరేష్ పలువురు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు.

# గతం ఘనం... ప్రస్తుతం దయనీయం!

- వెలుగులు విరజిమ్మిన స్టేషన్ బోనకల్‌కు గ్రహణం
- ఒకప్పుడు జనసందోహంతో కళకళలాడిన రైల్వే స్టేషన్ ప్రాంతం
- నేడు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న వైనం
- అధికారులు, పాలకులు ఈ ప్రాంతం పై దృష్టి పెట్టాలి
- కోరుతున్న స్టేషన్ బోనకల్ స్థానికులు





**బోనకల్,ఆగస్టు 10(ప్రజా జ్యోతి):** ఆ ప్రాంతం ఒకప్పుడు బోనకల్‌కు గుండె కాయలా ఉండేది... రైల్వే స్టేషన్ రాకపోకలతో వ్యాపార కార్యకలాపాలతో నిత్యం సందడిగా కనిపించేది. ప్రయాణికులు సౌకర్యార్థం కొరకు నాడు బస్సులు వచ్చేవి. సినిమా హాల్ సందడి ఉండేది.. రైల్వే స్టేషన్, బస్టాండ్, బ్యాంకులు, పోలీస్ స్టేషన్, పాఠశాలలు వంటి కీలక సంస్థలు అక్కడే ఉండటంతో నిత్యం జనసందోహంతో ఆ ప్రాంతం కళకళలాడేది. అయితే కాలం మారింది.. పరిస్థితులు మారాయి..ఒకప్పుడు వెలుగులు విరజిమ్మిన స్టేషన్ బోనకల్ ప్రాంతం నేడు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది అంటానికి ఎటువంటి సందేహం లేదు.

**మూడు దశాబ్దాల క్రితం వేసిన రోడ్డు.. నేడు అధ్వానంగా**

స్టేషన్ బోనకల్ ప్రాంతంలోని ప్రధాన సీసీ రోడ్డు నిర్మించి సుమారు మూడు దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ, ఇప్పటికీ అదే రహదారిపై ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. కాలక్రమేణా రోడ్డు నాణ్యత పూర్తిగా దెబ్బతిని గుంతలు, అసమతలతతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసర పనులపై వెళ్లే ప్రజలు సైతం రహదారి పరిస్థితులతో అవస్థలు పడుతున్నారు.

**డ్రైనేజీ లేక.. వర్షం వస్తే రోడ్డే కాలువ**

డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం ఈ ప్రాంతానికి మరో ప్రధాన సమస్యగా మారింది. వర్షం కురిసిన ప్రతిసారీ మురుగు, వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచిపోవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. చిన్నపాటి వర్షానికే రోడ్డు జలమయంగా మారుతుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు ఎటు పోయే సౌకర్యం లేక నిలువ ఉండడంతో మురికి నీరుగా మారి ఆ ప్రాంతం వద్ద దోమల బెడదతో నానా ఇబ్బందులు పడుతున్నారు.

**వెడల్పైన రహదారి.. ఆక్రమణ...**

గతంలో విశాలంగా ఉన్న రహదారి నేడు ఆక్రమణల కారణంగా క్రమంగా కుచించుకుపోయింది. రహదారికి ఇరువైపులా ఏర్పడిన ఆక్రమణలు, అనధికార నిర్మాణాలు, రోడ్డు మార్జిన్ల వినియోగం కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ముఖ్యంగా రైల్వే స్టేషన్ వైపు



వెళ్లే సమయంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.రైల్వే స్టేషన్‌కు వెళ్లాలన్నా..పోలీస్ స్టేషన్‌కు, గురుకుల పాఠశాల వెళ్లాలన్నా అవస్థలే. రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులతో పాటు పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు కూడా రహదారి పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ప్రజల రాకపోకలు ఉండే ఈ ప్రాంతంలో కనీస మౌలిక వసతులు లేకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గత వైభవం ఎక్కడ?**

ఒకప్పుడు బస్సులు, రైళ్లు, వ్యాపారాలతో నిత్యం సందడిగా ఉండే స్టేషన్ బోనకల్ ప్రాంతం నేడు వెలవెలబోతోంది. వ్యాపార, వాణిజ్య పరంగా ఒకప్పుడు ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ ప్రాంతం అభివృద్ధికి దూరమవుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఇప్పటికైనా పాలకులు స్పందించేనా?**

ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్టేషన్ బోనకల్ ప్రాంతంలో పాత సీసీ రోడ్డు స్థానంలో నాణ్యమైన కొత్త రహదారి నిర్మించాలని, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, రహదారి ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. గత వైభవాన్ని తిరిగి తీసుకురావాలంటే పాలకులు, అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే ఒకప్పుడు బోనకల్ వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు కేంద్రబిందువుగా నిలిచిన స్టేషన్ ప్రాంతం చరిత్ర పుటల్లోనే మిగిలిపోయే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రస్తుత పాలకులు, అధికారులు ఈ ప్రాంతంపై దృష్టి పెట్టి ప్రజల ఇబ్బందులను తొలగించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి దిశకు తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు, పాలకులు స్పందిస్తారా లేదా వేచి చూద్దాం..?

# మోడీ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు మల్లెల సన్మతరావు
- జైల్ భరో కార్యక్రమం విజయవంతం




**పాలేరు ఆర్.సీ ఆగస్టు10 ప్రజా జ్యోతి** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు మల్లెల సన్మాతరావు పిలుపునిచ్చాడు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన జైల్ భరో కార్యక్రమం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జైభరో కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పద్మారెడ్డి భువన నుండి నేలకొండపల్లి రోడ్డు నుండి ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ సెంటర్లో రోడ్డుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు తోటకూరి రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సన్మంతరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు, వాటి నిబంధనలను పూర్తిగా రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు 2025ను వెనక్కి తీసుకోవాలని, విద్యుత్ రంగం ప్రైవేటుకరణ నిలిపియాలని, కనీస వేతనం రూ .42,000 లను,డిఎతో అనుబంధం చేసి అన్ని రకాల కార్మికులకు, అమలు చేయాలని, విబిజి రామ్ జీ చట్టాన్ని రద్దుచేసి, ఎం.జి.ఎన్.ఆర్ఇజిఎ ను పునరుద్ధరించి సంవత్సరానికి 200 రోజుల పని, రోజుకు రూ .700 రూపాయలు ఇవ్వాలని, దేశ ప్రయోజనాలకు విరుద్ధమైన వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని, స్వామి నాథ్ కమిటీ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరల చట్టం చేపట్టాలని, రైతులు, పేదల కోసం సమగ్ర రుణమాఫీ అమలు చేయాలని, భూసేకరణ చట్టం 2013 సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజాసంఘాల నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిత్తూరు వెంకన్న తెలంగాణ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎడవల్లి రమణారెడ్డి,బిక్క సాని గంగాధర్,చేగొమ్మ సొసైటీ చైర్మన్ బడేటి శీను, సిఐటియు మండల అధ్యక్షుడు భూక్య హుస్సేన్, పందిరి శ్రీను, టీఎంకెఎంకెఎస్ జిల్లా కార్యదర్శి సింగం కృష్ణంరాజు, సింగం సోమయ్య, ప్రజా సంఘాల నాయకులు శీలం గురుమూర్తి చీర్ల రాధాకృష్ణ, కర్ణ బాబు , జవ్వాజి శీను, కందుల బాబు, ఎర్రబోయిన సురేష్ నిమ్మల ఉపేందర్ మామిడాల ఉపేందర్ ఎస్.కె బాబు,వెన్ను ఉపేందర్,రూప్లా నాయక్, బాసు నాయక్, ఆరుట్ల శ్రీను వీర బాబు బెల్లం నాగేశ్వరరావు ప్రతాప్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఏపీలో వివిధ ఆలయాలను సందర్శించిన బీఆర్ఎస్ మండల నాయకులు



**ముదిగొండ ఆగస్టు 10(ప్రజా జ్యోతి )** ఆంధ్ర ప్రదేశ్ విజయవాడ లోని కనకదుర్గమ్మ ఇంద్రకీలాద్రి ఆలయము మరియు గుంటూరు అమరావతి లోని టీటీడీ ఆలయం మరియు మంగళగిరిలోని పానకాల నరసింహస్వామి ఆలయాలను ముదిగొండ మండల పరిషత్ మాజీ అధ్యక్షులు సామినేని హరిప్రసాద్ మరియు బీఆర్ఎస్ జిల్లా నాయకులు బంకామల్లయ్య ఎడవల్లి లక్ష్మీ పురం మరియు కట్టకూరు గ్రామ బీఆర్ఎస్ ఉపసర్పంచులు మల్లేపల్లి శంకర్ కొత్తపల్లి పద్మా నాగార్జున్ తదితరులు సందర్శించారు. ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రం లో వర్షాలు బాగా కురిసి రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా రైతులకు పంటలు బాగా పండాలని ఈ సందర్భంగా వారు దేవుళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అమరావతి టీటీడీ ఆలయంలో సందర్శన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి మాజీ సాంఘిక సంక్షేమ మరియు విద్యా శాఖ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ కలవగా తాము పరిచయం చేసుకున్న సందర్భంగా మమ్మల్ని ఆప్యాయంగా పలకరించారు ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా నాయకులు గురించి ప్రస్తావించారు గుంటూరు పెద్దకూరపాడు లో బంకా వారి కుటుంబాలు కూడా కొన్ని ఉన్నాయని మాట మంతి మాట్లాడారు. అర్చకులు ఆలయమర్యాదలతో ఎమ్మెల్సీ ని సన్మానించి తీర్థ ప్రసాదాలను అందించారు అమరావతిలోని సెక్రటేరియట్ నూతన భవనాన్ని సందర్శించారు.

## రిపోర్టర్ సత్యానందం కుటుంబానికి ఆర్థిక చేయూత

- 13,000 రూపాయలు చెక్ అందజేసిన మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కంచర్ల బాబు



**బోనకల్, ఆగస్టు 10 (ప్రజా జ్యోతి):** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విజన్ ఆంధ్ర విలేఖరి మంద సత్యానందం కుటుంబానికి గోవిందపురం గ్రామానికి చెందిన మధిర మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంచర్ల బాబు అండగా నిలిచారు. సత్యానందం కుటుంబ సభ్యుల పేరు మీద రూ.13 వేల ఫిక్సడ్ డిపాజిట్ చేయించారు.ఈ సందర్భంగా కంచర్ల బాబు మాట్లాడుతూ.. సత్యానందం అందరితో కలివిడిగా ఉంటూ, జర్నలిస్టుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ముందుండేవారని అన్నారు. అలాంటి వ్యక్తి రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం ఎంతో బాధాకరమని అన్నారు. సత్యానందం కుటుంబానికి తమ వంతు సహాయం అందించడం సామాజిక బాధ్యతగా భావించామని తెలిపారు. బాధిత కుటుంబానికి మరింత మంది దాతలు అండగా నిలిచి సహాయం చేయాలని ఆయన కోరారు.

మిస్ట్ అధినేతను పరామర్శించిన మంత్రి తుమ్మల

## తృటిలో తప్పిన ప్రమాదం



**సత్తుపల్లి ఆగస్ట్10(ప్రజా జ్యోతి )** మదర్ తెరిసా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అటానమస్ కళాశాల అధినేత చలసాని సాంబశివరావు సోమవారం సత్తుపల్లి నుండి ఖమ్మం వైపు గ్రీన్ ఫీల్డ్ హైవేపై వెళుతున్నారు. ఈ క్రమంలో ముందుగా వెళ్లే వ్యాన్ సడన్ గా అడ్డంగా తిరగడంతో, డ్రైవర్ అప్రమత్తత తో ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయింది. వాహనంలో ఉన్న వ్యక్తికి ఎటువంటి గాయాలు కాకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆయనను చరవాణిలో పరామర్శించి, యాక్సిడెంట్ వివరాలను తెలుసుకున్నారు. రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

## మర్లపాడులో మానవహారం

- ప్రజాసంఘాల జైల్ బరో ప్రదర్శన



**వేంసూరు,ఆగస్టు10ప్రజాజ్యోతి** వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలో నాలుగురోడ్ల కూడలిలో సీపీఎం అనుబంధ సీఐటీయూ,రైతుసంఘం,వ్యవసాయ కార్మిక సంఘం ల ఆధ్వర్యంలో సోమవారం అఖిలభారత కమిటి పిలుపులో భాగంగా మానవహారం కార్యక్రమం నిర్వహించారు.ముందుగా వేంసూరులోని ఎర్రా రామయ్య భవనం నుండి మర్లపాడు సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నరైతు సంఘం డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నేడు దేశ జి.డి.పి.వృద్ధికి దోహద పడుతున్న కార్మికుల,కర్షకుల,కూలీల హక్కులను హరిస్తూ కార్పొరేట్లకు కట్టు బానిసలుగా మార్చే కుట్ర చేస్తుం-దన్నారు.నాటి క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో మోదీ ప్రభుత్వం భారీ నుండి భారత్ ను కాపాడుకోవాల్సిన అవసరం ఏర్పడిందని ప్రజలు గుర్తించాలని కోరారు.నేతలను,కార్యకర్తలను పోలీసులు ఎస్ఐ బి. కవిత ఆధ్వర్యంలో అడ్డుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.అనంతరం ప్రజాసంఘాల నేతలు మండలంలో జైల్ బరో కార్యక్రమం సక్సెస్ అయ్యిందని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో: రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కొత్తా సత్యనారాయణ,అర్వపల్లి గోపాలరావు,సీపీఎం మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్ రావు,సుశీల,డంకర శ్రీను,కావూరి సుదర్శన్ లతో పాటు సీపీఎం మండల నేతలు,సీఐటీయూ అనుబంధ సంఘాల నుండి అంగన్వాడీలు, హమాలీలు, ఆటో డ్రైవర్లు, బిల్డింగ్ వర్కర్స్,పెట్రోల్ బంక్ వర్కర్స్,మెకానిక్స్ తదితర రంగాల కార్మికులు,రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ముగిసిన 'నవోదయ' దరఖాస్తు గడువు

- ఈనెల 12 వరకు ఎడిట్ చేసుకునే అవకాశం

**పాలేరు ఆర్.సీ ఆగస్టు 10 ప్రజా జ్యోతి** పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో 2027–28 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 10తో ముగిసిందని పాఠశాల ప్రిన్సిపల్ సీహెచ్. వెంకటరమణ తెలిపారు.

**12 వరకు సవరణలు**

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే ఈనెల 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎడిట్ ఆప్షన్ ద్వారా సవరించుకునే అవకాశం ఉందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. అభ్యర్థి పేరు, తల్లి లేదా తండ్రి పేరు, పుట్టిన తేదీ, లింగం, జాతీయత, కులం, చిరునామా, పాఠశాల వివరాల్లో అవసరమైన సవరణలు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుదారులు గడువు ముగిసేలోగా తప్పులను సరిచేసుకోవాలని సూచించారు

## పలు కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



**నేలకొండపల్లి, ఆగస్టు 10 ప్రజా జ్యోతి:** ఇటీవల మండ్రాజుపల్లి గ్రామంలో అస్వస్థతకు గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు నెల్లూరి భద్రయ్యను సోమవారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పరామర్శించారు. అనంతరం, నేలకొండపల్లి పట్టణంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు గుడిబోయిన సైదులు చిత్ర పటానికి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే, గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మోర పద్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజని, నాయకులు సోమనబోయిన సాయినవీన్, కడియాల నరేష్ పాల్గొన్నారు..

# బోనకల్ లో జైల్ పరో కార్యక్రమం విజయవంతం

- భారీగా పాల్గొన్న కార్మికులు, ఉద్యోగులు
- బోనకల్ లో రెండు గంటల పాటు రాస్తా రోకో
- భారీగా రాకపోకలకు అంతరాయం
- ఆందోళనకారులను అరెస్టు చేసిన పోలీసులు
- కొద్దిసేపు పోలీస్ స్టేషన్ ముందు నిరసన కారుల ఆందోళన



**బోనకల్, ఆగస్టు 10 (ప్రజా జ్యోతి):** క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో ప్రజా సంఘాలు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన జైల్ భరో కార్యక్రమం సంపూర్ణంగా విజయవంతంగా ముగిసింది. వివిధ ప్రజా సంఘాల నాయకులు ఉదయం ఎనిమిది గంటలకే మండల కేంద్రానికి చేరుకున్నారు. సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్కు చేరుకున్నారు. అక్కడ సుమారు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో పెద్ద ఎత్తున బోనకల్ ఖమ్మం రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో బోనకల్ ఎస్ఐ మాచినేని రవి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులందరినీ అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణ ముందు కూడా కొద్దిసేపు నిరసనకారులు ఆందోళన నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆందోళనకారులను పోలీసులు విడిచిపెట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం కేంద్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, తెలంగాణ రైతు సంఘం మధిర డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, డివిజన్ నాయకులు కిలారు సురేష్, సీఐటీయూ జిల్లా నాయకులు బోయినపల్లి వీరబాబు, సిఐటియు మండల కన్వీనర్ గుగులోతు నరేష్ మాట్లాడుతూ... నాలుగు లేబర్ కోడ్లను వాటి నిబంధనలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రోషా కార్మిక సంఘం మధిర డివిజన్ అధ్యక్షులు బంధం శ్రీనివాసరావు, సీఐటీయూ మండల కమిటీ సభ్యులు మరీదు పుల్లయ్య, రామన సరోజిని, రాయల విజయలక్ష్మి, షేక్ ఖాదర్ బాబా, సత్తుపాటి రాణి, మండల అధ్యక్షుడు తెల్లాకుల శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బంధం వెంకట రాజ్యం, జొన్నలగడ్డ సునీత, తెల్లాకుల రజిని, తెలంగాణ రైతు సంఘం మధిర డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి తుళ్లూరు రమేష్, గుద్దురి ఉమ, పల్లా కొండల రావు, పిల్లలమర్రి వెంకట అప్పారావు, నరేష్, సునీత, కిరణ్ కుమార్, ఆశా కార్యకర్తలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జైల్ భరో విజయవంతం



**నేలకొండపల్లి, ఆగస్టు 10 ప్రజా జ్యోతి:** కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతులు, కూలీలు, ప్రజా సంఘాలకు వ్యతిరేకంగా అమలు చేస్తున్న విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం నేలకొండపల్లి లోని పీఎస్ఆర్ సెంటర్ నందు ఖమ్మం – కోదాడ ప్రధాన రహదారిపై తెలంగాణ రైతు సంఘం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటీయూసీ, సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ పార్టీలు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులు, కార్యకర్తలు బైఠాయించి చేపట్టిన జై భరో కార్యక్రమం విజయవంతమైంది. తొలుత ఆయా ప్రజా సంఘాలు పార్టీల కార్యాలయాల నుండి కార్యకర్తలు వివిధ ప్రజా సంఘాల శ్రేణులు భారీ ప్రదర్శనగా బయలుదేరి పొట్టి శ్రీరాములు సెంటర్ కు చేరుకున్నారు. రహదారి పై వారు బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విధానాలను నిరసిస్తూ వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.వి రామిరెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, మండల సిపిఐ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు పగిడికత్తుల రామదాసు, చిర్రా బిక్షం, రైతు సంఘం మండల కార్యదర్శి రచ్చ నరసింహారావు, అధ్యక్షుడు ఇంటూరి అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దుగ్గి నరసింహారావు, కార్యదర్శి పెద్దపాక మల్లేశ్వరరావు, మహిళా సంఘం జిల్లా నాయకురాలు బెల్లం లక్ష్మి, మండల అధ్యక్షురాలు బలుసు ప్రమీల, నాయకులు దుగ్గి వెంకటేశ్వర్లు ఏటుకూరి రామారావు, రావెళ్ల సుదర్శన్ రావు, భూక్య కృష్ణ, ఎడ్ల తిరపారావు, మందడపు మురళీకృష్ణ, దండా సూర్యనారాయణ, దేగల వెంకటేశ్వరరావు, మారుతి కొండలరావు, యలమద్ది లెనిన్, అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకురాలు కోటేశ్వరి, సామాల మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు. ధర్నా ఆందోళన చేస్తున్న వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలను నేలకొండపల్లి పోలీసులు అరెస్టు చేసి అదుపు లోకి తీసుకున్నారు.

## జైల్ భరో కార్యక్రమం విజయవంతం

- లింగాల ఎక్స్ రోడ్ నందు
- క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్ భరో కార్యక్రమం విజయవంతం
- సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో





**కామేపల్లి ప్రజా జ్యోతి ఆగస్టు 10** కామేపల్లి మండలం లోని లింగాల క్రాస్ రోడ్ సెంటర్ నందు జైల్ బరో కార్యక్రమం విజయవంతం సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన రాస్తారోకో కార్యక్రమంలో రైతు సంఘం వైరా డివిజన్ కార్యదర్శి దుగ్గి కృష్ణ సిఐటియు మండల కన్వీనర్ శ్రీను పాల్గొని మాట్లాడ తు దేశంలో 29 చట్టాలను రూపకల్పన అయి ఉంటే ఆ చట్టాలను మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తొలగించి నాలుగు లేబర్ కోడ్ గా మార్చి వాటిని నల్ల చట్టాలుగా మార్చి కార్మికులను కర్షకులకు రైతులకు ముంచే కోడుగా మార్చి సమస్త ప్రజా సమస్యలను నట్టేట ముంచిండు అందుకని కార్మికుల సంఘాల నాయకత్వం గుర్తిందియ ఉద్యమ స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలియజేయడం జరిగింది ఈరోజు దేశవ్యాప్తంగా క్విట్ ఇండియా ఉద్యమం జైల్ బరో కార్యక్రమం చేయడం జరిగింది మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లో గాంధీ పేరు తీసేయడం భారత్ రాంజీ అనే పేరు మార్చటానికి స్వామి నాథన్ కమిషన్ సిఫారసులను కనీసం పట్టించుకోనటువంటి మోడీ మొండి వైఖరి విధానాలకు వ్యతిరేకంగా ఈరోజు ఈ జైల్ భరో కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాధావత్ శ్రీను రైతు సంఘం వైరా డివిజన్ కార్యదర్శి దుగ్గి కృష్ణ సిపిఎం మండల కార్యదర్శి అంబటి శ్రీనివాస్ రెడ్డి ఆశ వర్కర్ మండల అధ్యక్ష కార్యదర్శులు కుర్ర నీల హాత్కర్ బుజ్జి అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు పాపారాణి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అమాంచి అంజయ్య బిల్డింగ్ వర్కర్స్ మండల నాయకులు కొత్తపల్లి ఉపేందర్ బుక్య రమణ రైతు సంఘం మండల అధ్యక్షులు రాయల సత్యనారాయణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఒప్పుదల వెంకన్న కార్మిక నాయకులు ధరావత్ కోటయ్య ఎస్కే ఫరీద్ వీరభద్రం భాష ఉపేందర్ నరేష్ లక్ష్మీనారాయణ నాగయ్య స్వరూప ప్రమీల అన్ని రంగాల కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు